# ఆర్థిక వ్యవస్థ - అభివృద్ధి

## భూసంస్కరణలు

**భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో 'భూ సంస్కరణలు' వ్యవసాయాభివృద్ధికి, ఆర్థికాభివృద్ధికే కాకుండా, సాంఘిక న్యాయాన్ని సాధించడానికి, గ్రామీణాభివృద్ధికి, రాజకీయాధికారంలో మార్పులు తీసుకురావడానికి దోహదపడతాయి. భూ సంస్కరణలను ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాల కోణంలో విశ్లేషించాల్సి ఉంటుంది.**

భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయరంగ ప్రాధాన్యం ఇప్పటికీ ప్రముఖంగానే ఉంది. వ్యవసాయరంగ ప్రాధాన్యతా ఆర్థిక వ్యవస్థ నుంచి పారిశ్రామిక, సేవారంగ ఆర్థిక వ్యవస్థలుగా రూపాంతరం చెందుతున్నా భారత జనాభాలో అధిక శాతం వ్యవసాయరంగంపైనే ఆధారపడుతున్నారు. దీంతో భూ సంస్కరణలను సామాజిక న్యాయం దిశగా అభివృద్ధిచేయాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలంటే నిర్మాణాత్మక, విప్లవాత్మక మార్పులు రావాలి.

★ వ్యవసాయ రంగంలో స్తబ్దతకున్న కారణాల్లో వ్యవస్థాపూర్వక అంశాలు ప్రధానపాత్ర పోషిస్తున్నాయి. అందుకే భూ సంస్కరణలనేవి నిర్మాణాత్మక మార్పులకు సంబంధించినవి. వ్యవసాయ రంగం వెనుకబాటుకు ఫ్యూడల్, సెమీ ఫ్యూడల్ విధానాలే కారణమని, వీటిలో నిర్మాణాత్మక మార్పులే ప్రధానమైనవని ఆర్థికవేత్త గున్నార్ మిర్డాల్ అభిప్రాయం.

### భూసంస్కరణల అవసరం - లక్ష్యాలు

వ్యవసాయ రంగంలో తక్కువ ఉత్పాదకత, వెనుకబాటుకు సరైన భూ సంస్కరణలు చేపట్టకపోవడమే ప్రధాన కారణంగా చెప్పవచ్చు. వ్యవస్థాపూర్వక అంశాలైన- భూస్వామ్య పద్ధతులు (వివిధ మధ్యవర్తిత్వ విధానాలైన జాగీర్దార్లు, జమీందార్లు, ఇనాందార్లు), కౌలు విధానాలు, భూ యాజమాన్య కేంద్రీకరణపై దృష్టిపెట్టాల్సిన ఆవశ్యకత పెరిగింది.

★ వీటికి వివిధ రాజకీయ అంశాలు, తీర్మానాలు, పార్టీల విధానాలు, రైతాంగ ఉద్యమాలు తోడయ్యాయి. వీటికి అనుగుణంగా హైదరాబాద్, సంయుక్త ఆంధ్రప్రదేశ్‌లో 1948-73 మధ్య మొదటి దఫా భూసంస్కరణల అమలు, తదుపరి 1970-80 దశకం మధ్యలో రెండో దశ భూసంస్కరణలు అమలయ్యాయి.

### లక్ష్యాలు

భారత రాజ్యాంగం 39 వ అధికరణ (బి, సి)లో భూ సంస్కరణల లక్ష్యాలను పొందుపరిచారు. భౌతిక వనరులపై యాజమాన్యం, నియంత్రణ అంశాలకు సంబంధించి జాతులన్నిటికీ ప్రయోజనం కలిగేలా న్యాయంగా పంచాలి.

★ సంపద కేంద్రీకరణ జరగకుండా ఉత్పత్తి వ్యవస్థ ప్రజాస్వామ్య ప్రయోజనాలకు అనుగుణంగా ఉండాలి.

★ ప్రొఫెసర్ రాజ్‌కృష్ణ అభిప్రాయం ప్రకారం మధ్యవర్తుల తొలగింపు, భూ హక్కుల పునఃపంపిణీ, కమతాల సమీకరణ, కౌలు సంస్కరణలు, సహకారం ప్రధానమైనవి.

★ ఐక్యరాజ్య సమితి దృష్టిలో భూమి పునఃపంపిణీ, కౌలు పరిమాణ నిర్ణయం కౌలుదారుకు భద్రత, వ్యవసాయ కార్మికుల వేతన నిర్ణయం, వ్యవసాయ పరపతి ఆధారాల అభివృద్ధి, భూమి పన్నుల విధానంలో మార్పులు, సహకార వ్యవస్థ, వ్యవసాయ విద్య, సాంకేతిక మార్పులు ముఖ్యమైనవి.

★ దున్నేవాడికి - ప్రభుత్వానికి మధ్య సంబంధాలను మెరుగుపరచడం, భూ యాజమాన్యం, నిర్వహణలో నిజమైన సాగుదారుకు మేలు చేసే మార్పులు తేవడం అవసరం.

★ 'రైతాంగం ఆర్థిక, సామాజిక, రాజకీయ శక్తులను శక్తిమంతం చేయడం భూ సంస్కరణల లక్ష్యం' అని నెహ్రూ పేర్కొన్నారు.

★ వ్యవసాయ రంగంలో వంశపారంపర్యంగా వచ్చిన ఏ ప్రతిబంధకాలు వ్యవసాయాభివృద్ధిని తగ్గిస్తున్నాయో వాటిని తొలగించాలి. అలాగే అన్నిరకాల దోపిడీలను, సాంఘిక అన్యాయాలను తొలగించి భూమిని దున్నేవాడికి పూర్తి రక్షణ, హక్కులను కల్పించాలి.

★ కౌలుదారులకు రక్షణ కల్పిస్తూ, వ్యవసాయ కూలీలకు, సన్నకారు రైతులకు భూమిని పునఃపంపిణీ చేయాలి.

★ కమతాల గరిష్ఠ పరిమితి, కౌలు భద్రత, మధ్యవర్తుల తొలగింపు లాంటి ప్రధానాంశాలే కాకుండా ప్రస్తుతం భూములకు సంబంధించిన రికార్డులు, కంప్యూటరీకరణ, పట్టాదారు పాస్ పుస్తకాలు, గిరిజన భూముల భద్రతకు సంబంధించిన అంశాలను సంస్కరించాలి.

★ మన రాజ్యాంగం కూడా భౌతిక వనరుల మీద యాజమాన్యం, నియంత్రణ సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం

కలిగించేలా భూమిని న్యాయబద్ధంగా పంచాలని పేర్కొంది.

★ సామాజిక న్యాయం, ఆదాయ అసమానతలను తొలగించడం లాంటి సామాజిక లక్ష్యాలతో పాటే భూసంస్కరణల్లో వ్యవస్థాపూర్వక లక్షణాలైన జాగీర్దార్లు, జమీందార్లు, ఇనాందార్లు లాంటి మధ్యవర్తుల తొలగింపు, కౌలు సంస్కరణలు, భూ గరిష్ఠ పరిమితి ప్రధాన లక్ష్యాలుగా మారాయి.

## తెలంగాణలో జాగీర్లు

✪ **పాయిగా జమాయత్ జాగీర్లు:** పామిగా అంటే గుర్రాన్ని కట్టే స్థలం. నిజాం అశ్విక దళాన్ని పోషించినందుకు ప్రతిఫలంగా ఇచ్చిన భూములు.

✪ **అవతమామ్ జాగీర్లు:** రాజముద్రతో శిస్తురహితంగా ఇచ్చిన భూములు.

✪ **జాత్ జాగీర్లు:** నిజాం కాలంలో విస్తృతమైన ప్రాంతాలకు సేవలు చేసినవారికి ఎలాంటి షరతులు లేకుండా ఇచ్చిన భూములు.

✪ **తనఖా జాగీర్లు:** నిజాం ప్రభుత్వ ఉద్యోగులకు జీతభత్యాలకు బదులుగా ఇచ్చిన భూములు.

✪ **మసురూధీ జాగీర్లు:** నిజాం రాజ్యంలో పౌర, సైనిక, మతపరమైన సేవలు చేసినవారికి ఇచ్చిన భూములు.

✪ **మదద్‌మాష్ జాగీర్లు:** ఉద్యోగుల జీవిత పోషణ కోసం ఇచ్చిన భూములు.

✪ నిజాం నవాబుకు ప్రత్యేకంగా సేవ చేసినవారికి లేదా ఆ వ్యక్తి గౌరవాన్ని నిలబెట్టడానికి ఉచితంగా దానం రూపంలో ఇచ్చిన గ్రామాలే 'జాగీర్లు'. ఇందులో కొన్ని జాగీర్లు నిజాంకు బాటకం చెల్లించేవి, కొన్ని బాటకం చెల్లించాల్సిన అవసరం లేనివి. ఇలాంటి జాగీర్లు హైదరాబాద్ సంస్థానంలోని 6,535 గ్రామాల్లో 40,000 చదరపు మైళ్ల విస్తీర్ణంలో ఉండేవి. 1922 లో 1167 గా ఉన్న జాగీర్లు 1949 నాటికి 1500 కు పెరిగాయి.

## సంస్థానాలు

మొదటి అసఫ్‌జా దక్కన్ ప్రాంతానికి రావడానికి ముందు తెలంగాణలో అనేక చిన్న, పెద్ద ప్రాంతాలకు అధిపతులుగా హిందూ రాజులుండేవారు. వీరినే సంస్థానాధీశులు అనేవారు. వీరు పాలించే ప్రాంతాలను సంస్థానాలు గా పేర్కొంటారు. నిజాం నవాబు హిందూ రాజుల హక్కులను అంగీకరించినందుకు నవాబుకు ప్రతి సంవత్సరం 'పేష్‌కస్' రూపంలో నిర్ణీత డబ్బు చెల్లించాల్సి ఉండేది.

★ హైదరాబాద్ రాజ్యంలో 14 సంస్థానాలున్నా, అందులో గద్వాల, వనపర్తి, జట్‌ప్రోలు, అమరచింత, పాల్వంచ ముఖ్యమైనవి. ఈ సంస్థానాధీశుల ఆధీనంలో 5030 చదరపు మైళ్ల విస్తీర్ణంలో 497 గ్రామాలు ఉండేవి.

## ఇనాందార్లు

ఇనాం అంటే బహుమతి. కొన్ని ప్రత్యేకమైన విధులను నిర్వహించినందుకు, మతపరమైన సేవలు చేసినందుకు ప్రతిఫలంగా ఇచ్చే భూములు. కవులు, కళాకారులు, పండితులు, మసీదులు, మదరసాలకు, నిజాం ఆస్థానంలో పని చేసే కిందిస్థాయి ఉద్యోగులకు బహుమతులు, జీతాలకు బదులు ఇచ్చే భూములు. ఇలాంటి ఇనాం భూములు 16 రకాలు ఉండేవి. **ఉదా:** అరాజమక్తా, అరాజ, అగ్రహార్, బలవతా ఇనాం, నీరడి ఇనాం, బిదుమత్ ఇనాం మొదలైనవి.

★ హైదరాబాద్ సంస్థానంలో 8200 మంది ఇనాందార్లు ఉండేవారు. ఇందులో దివానీ ప్రాంతంలో 57 వేల మంది, జాగీర్దారీ ప్రాంతంలో 26 వేల మంది ఉండేవారు. వీరి ఆధీనంలో 8 లక్షల ఎకరాల భూమి ఉండేది.

## సర్ఫేఖాస్

నిజాం సొంత ఖర్చుల కోసం నిర్దేశించిన భూమి లేదా గ్రామాలు. వీటి నుంచి వచ్చే బాటకం నిజాం ఖజానాకు చేరేది. సర్ఫేఖాస్ భూములు 5,682 చదరపు మైళ్ల విస్తీర్ణంలో 1374 గ్రామాల్లో ఉండేవి. 1949 లో జె.ఎన్.చౌదరి జారీ చేసిన ఫర్మానాతో సర్ఫేఖాస్ భూములను రద్దు చేసి నిజాంకు 3 కోట్లు చెల్లించారు.

## రైత్వారీ భూములు

రైత్వారీ భూములనే ఖల్సా/ దివానీ అని కూడా అంటారు. హైదరాబాద్ సంస్థానం చుట్టుపక్కల 60% విస్తీర్ణంలో ప్రభుత్వ ప్రత్యక్ష పాలన కింద ఉండే భూములు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ యంత్రాంగమే శిస్తు వసూలు చేసేది.

★ 1875 లో క్రమబద్ధమైన సర్వే సెటిల్‌మెంట్ విధానం ప్రవేశ పెట్టడానికి ముందు మధ్యవర్తి పద్ధతి ఉండేది. వీటినే సర్‌బస్తా, పాన్‌మక్తా, ఇజారా అనేవారు.

★ మధ్యవర్తులకు (దళారీలు) వేలం వేసి శిస్తు వసూలు చేసే అధికారం ఇచ్చేవారు. వీరిని దేశ్‌ముఖ్, సర్దేశ్‌ముఖ్, సర్దేశాయ్ అనేవారు. కాలక్రమంగా వీరే ఖల్సా ప్రాంతంలో అతి పెద్ద భూస్వాములుగా మారారు.

★ పైన తెలిపిన భూస్వామ్య విధానాల వల్ల అనుపస్థిత (Absentee Land Lords) భూస్వాముల సంఖ్య 1891 లో లక్ష ఉండగా, వీరి సంఖ్య 1921 నాటికి 7.6 లక్షలకు పెరిగింది. హైదరాబాద్ సంస్థానం రెవిన్యూ ఆదాయం (8 కోట్లు) కంటే 110 మంది జమీందార్ల ఆదాయం (10 కోట్లు) అధికంగా ఉండేది. హైదరాబాద్ సంస్థానంలో 82 రకాల అక్రమ నిర్బంధ వసూళ్లు ఉండేవి.

**మాదిరి ప్రశ్నలు**

**1.** భూ సంస్కరణలు రావడానికి ప్రధానమైన వ్యవస్థాపూర్వక అంశం ఏది?

1) భూస్వామ్య పద్ధతులు 2) కౌలు విధానాలు 3) భూయాజమాన్య కేంద్రీకరణ 4) పైవన్నీ

**2.** భారత రాజ్యాంగంలోని ఏ అధికరణంలో (ఆర్టికల్) భూ సంస్కరణలు పొందుపరిచారు?

1) 36 2) 37 3) 38 4) 39

**3.** తెలంగాణ ప్రాంతంలో మధ్యవర్తులు అంటే ఎవరు? (భూస్వామ్య విధానంలో)

1) జాగీర్లు 2) జమీందార్లు 3) భూకామందులు 4) కౌలుదార్లు

**4.** హైదరాబాద్ ప్రాంతంలో కౌలు చెల్లింపులో ఉత్పత్తితో సంబంధం లేకుండా స్థిర మొత్తంలో చెల్లించే పద్ధతిని ఏమని పిలిచేవారు?

1) శిస్తు/కౌలు 2) బెతాయి/పంటలో భాగం 3) గల్లామక్తా 4) పైవన్నీ

**5.** నిజాం కాలంలో 'పాయిగా జమాయత్ జాగీర్లు' ఎవరు?

1) నిజాం కాలంలో విస్తృతమైన ప్రాంతాలకు సేవలు చేసినవారికి షరతులు లేకుండా ఇచ్చిన భూములు

2) ప్రభుత్వ ఉద్యోగులకు జీతభత్యాలకు బదులుగా ఇచ్చిన భూములు

3) నిజాం అశ్విక దళాన్ని పోషించినందుకు ప్రతిఫలంగా ఇచ్చిన భూములు

4) రాజముద్రతో శిస్తురహితంగా ఇచ్చిన భూములు

**6.** నిజాం రాజ్యంలో పౌర, సైనిక, మతపరమైన సేవలు చేసినవారికి ఇచ్చే భూములు ఏవి?

1) మసురూధీ జాగీర్లు 2) మదద్‌మాష్ జాగీర్లు

3) తనఖా జాగీర్లు 4) జాత్ జాగీర్లు

**7.** హైదరాబాద్ రాజ్యంలో 1949 నాటికి ఉన్న జాగీర్ల సంఖ్య ఎంత?

1) 1300 2) 1400 3) 1500 4) 1600

**8.** కిందివాటిలో హైదరాబాద్ రాజ్యంలో ప్రధానమైన అయిదు పెద్ద సంస్థానాలకు చెందనిది ఏది?

1) గద్వాల 2) పాల్వంచ 3) అమరచింత 4) జనగామ

**9.** నిజాం నవాబు కాలంలో ఎన్ని రకాల ఇనాం భూములుండేవి?

1) 15 2) 16 3) 17 4) 18

**10.** హైదరాబాద్ సంస్థానంలో ఖల్సా లేదా దివానీ వసూలు చేసే అధికారాన్ని వేలం వేసి ఈ కింది మధ్యవర్తుల్లో ఎవరికి ఇచ్చేవారు?

1) దేశ్‌ముఖ్ 2) సర్దేశ్‌ముఖ్ 3) దేశాయ్ 4) పైవారందరు

**11.** జిరాయితీ హక్కులున్న కౌలుదార్లు ఏ ప్రాంతంలో ఉండేవారు?

1) హైదరాబాద్ ప్రాంతం 2) బెంగాల్ ప్రాంతం 3) ఆంధ్ర ప్రాంతం 4) పైవేవీ కావు

**12.** తెలంగాణలో కౌలుదార్ల స్థితిగతులపై ఎం.ఎస్.బరూచా కమిటీని ఎప్పుడు ఏర్పాటు చేశారు?

1) 1934 2) 1935 3) 1936 4) 1937

**13.** హైదరాబాద్ రాష్ట్రంలో ఏ హక్కులూ లేని కౌలుదార్లను ఏమని పిలిచేవారు?

1) అసామీ షక్మిదారులు 2) షక్మిదారులు 3) మధ్యవర్తులు 4) నిజాం ఉద్యోగులు

**జవాబులు:** 1-4 ; 2-4 ; 3-1 ; 4-3 ; 5-3 ; 6-1 ; 7-3 ; 8-4 ; 9-2 ; 10-4 ; 11-3 ; 12-4 ; 13-1.

**- దాడి నరేన్**

www.eenadupratibha.net